ప్రజాశక్తి

మంగళవారం 1 ఏప్రిల్ 2025

5

పార్వతీపురం మన్యం

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు

ప్రజాశక్తి - పార్వతీపురం

నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో సాగు చేసిన ఆపరాల కొనుగోలుకు సంబంధించి పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేస్తామని ఆమె చెప్పారు. క్వింటా మినుములకు రూ.7,400 మద్దతు ధర నిర్ణయించామన్నారు. ఇ-క్రాప్, ఇ-కెవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో సిఎం యాప్‌లో పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పంటను విక్రయించాలని జేసీ శోభిక సూచించారు.

పి-4 సర్వేతో ఆందోళన

• 27 రకాల ప్రశ్నలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

• సచివాలయ ఉద్యోగులకూ తప్పని పనిభారం

గుమ్మ గ్రామంలో సర్వే చేపడుతున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

గత కొన్ని రోజులుగా మండలంలోని సామాన్య ప్రజలు ఆందోళన చెందేలా ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వేలు అమాయక ప్రజల్లో భయాందోళన గురి చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఎన్నో రకాలుగా ప్రజలకు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా హామీలు అమలుకు మాత్రం నోచుకోలేదు. తాజాగా 'పి 4' సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎక్కడ ఎత్తేస్తారోననే భయం ప్రజల్లో నెలకొంది.

సర్వేలో అడుగుతున్న ప్రశ్నలు

ఫోన్ , టీవీ, ఎసి, గృహోపకరణాలు, బైకులు ఉన్నాయా, ఇళ్ల స్వరూపం, బ్యాంక్ అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను సేకరించి సంబంధిత వివరాలను సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఒటిపిని నమోదు చేసే ప్రక్రియతో సర్వే ముగిస్తున్నారు.

కురుపాం మండల పరిధిలో దారిద్ర్య రేఖకు దిగువన సుమారు 14,182 కుటుంబాలు ఉన్నట్లు అధికారుల అంచనా. ఎండల తీవ్రత రీత్యా చాలా వరకు మధ్యతరగతి కుటుంబాల్లో అప్పోసప్పు చేసి నెలవారీ వాయిదాల్లో ఎసిలను ఇంటికి కావాల్సిన వస్తువులను ఎక్కువగా కొంటూ ఉంటారు. ఎసి ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది ఆ వివరాలను ప్రభుత్వ రికార్డులోకి నమోదు చేస్తున్నారు. దీంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయేమోనని ఆందోళన పేదల్లో నెలకొంది. గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే జరుగుతుంది. ఒక్కొక్క సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని కుటుంబాలకు సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. పని భారంతో వారిలో కూడా ఆందోళన నెలకొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా మిస్సింగ్ సిటిజన్, మిస్సింగ్ ఎంప్లాయిస్, వర్క్ ఫ్రం హోం, జియో ట్యాగింగ్ డెత్ రీవెరిఫికేషన్, ఆరేళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్, నాన్ రెసిడెన్షియల్, ఇంటి పన్ను, కుళాయి పన్ను, పశువులతో పాటు ఆయా సర్వేలపై ఐవిఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నారు. చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండడంతో సచివాలయ సిబ్బంది పని భారంతో సతమతమవుతున్నారు.

సిబ్బందికి తప్పని ఇబ్బందులు

రోజుకో రకమైన సర్వేలు నిర్వహించాలని సచివాలయ ఉన్నతాధికారులు సిబ్బందిని ఒత్తిడి చేయడంతో కార్యాలయంలో పథకాల కోసం వస్తున్న ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో సచివాల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం ఇకెవైసిలు చేసుకుని ఈ ప్రాంతంలో నమోదు చేసుకున్న కుటుంబాలు ప్రస్తుతం ఉద్యోగరీత్యా ఈ ప్రాంతంలో నివాసం లేకపోవడంతో సర్వేల్లో అనేక కుటుంబాలు సర్వే నిర్వహించనున్నట్లు చూపిస్తుంది. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు అధికంగా ఒత్తిడి చేయడంతో స్థానికేతరులకు సర్వే ఎలా నిర్వహించాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్లు, బైకులు ఇలాంటి ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోతపడుతుందని ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేలకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలని ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తుంది. పి-4 సర్వేను నిబంధనలను అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపిడిఒ కింది స్థాయి అధికారులకు చెపుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందని, ఈ అంశాన్ని ప్రజలకు తెలియపర్చాలని సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో కొంత అయోమయం నెలకొంది. పై సర్వేలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనన్న ఆందోళన దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో నెలకొంది. గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే ఈ ప్రభుత్వం వ్యవహరించడంతో కొంత అసంతృప్తి ప్రజల్లో నెలకొంది. సామాన్య ప్రజలను సంక్షేమానికి దూరం చేయకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సిమిడివలస-కొత్తూరు రహదారిని ప్రారంభిస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం

మూడు రోడ్లకు రూ.30 కోట్లు మంజూరు : మంత్రి

ప్రజాశక్తి -సాలూరురూరల్

జిల్లాలోని గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని తోణాం పంచాయతీ సిమిడివలస నుంచి కొత్తూరు వరకు రూ.కోటీ 25లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాలూరు మండలంలో మూడు రోడ్లకు రూ.30 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో కురుకుట్టి నుంచి సంపంగిపాడు వరకు రూ.17.20 కోట్లతో 14 కిలోమీటర్ల రోడ్డు, కొదమ నుంచి చింతమల వరకు రూ.7.90 కోట్లతో ఆరు కిలోమీటర్ల రోడ్డు, మరో రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. డోలి సమస్యలు తలెత్తకుండా గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. కొదమ రహదారి అత్యంత కష్టతరమైందని, ప్రజలతో మమేకమ య్యేందుకు, వారి సమస్యలను తెలుసుకోవడానికి తాను ఆటోలో ప్రయాణించానని ఆమె చెప్పారు. సిమిడివలస ప్రజలు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు కావాలని కోరగా ఆమె స్పందిస్తూ విద్యార్థుల సంఖ్య, నిబంధనలు అనుకూలిస్తే గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లల్లో నైతికత పెంపొందించండి

మగపిల్లల్లో కనీస నైతికత పెంపొందించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోజు రోజుకు ఆడపిల్లలు, మహిళలపై అనేక సంఘట నలు జరుగుతున్నాయని, అందుకు సమాజమే కారణమని ఆమె వాపోయారు. కుటుంబంలోనే నీతి బోధించాలన్నారు. కుటుంబ సమాజంలో ప్రతి అబ్బాయికి తల్లి, సోదరి చాలా మంది బంధువులు ఉంటారని, ఆడపిల్లలు, మహిళలపై క్రూరత్వం జరగకూడదని ఆమె అన్నారు. తల్లిదండ్రులు వారికి బోధించాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు వారు పాటించాల్సిన కనీస నైతికత, జాగ్రత్తలు సూచించాలని ఆమె ఉద్బోధించారు. అనంతరము సిమిడివలస, కొత్తూరు, పట్టుచెన్నూరు, పగులు చెన్నూరు నుండి వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, ఐటిడిఎ ఇంజనీరింగ్ అధికారులు, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, టిడిపి నాయకులు, సర్పంచ్ ఆడయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలి : కలెక్టర్

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తిం - పార్వతీపురం

జిల్లాలో నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. వేసవి దృష్ట్యా నీటి నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో 14 రకాల పరీక్షలు చేపడుతున్నామని, దీన్ని ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఆయన ఆదేశించారు. అన్ని రకాల టెస్టులను చేపట్టాలని సూచించారు. ఈ పరీక్షల విషయమై క్షేత్రస్థాయిలో అధికారులకు అవగాహన ఉండాలన్నారు. బయోలాజికల్ కంటెంట్, క్లోరిన్ లెవెల్‌టెస్టులు ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. నీటి నాణ్యత పరీక్షల్లో ఇప్పటి దాకా పాజిటివ్ నమోదు అంశాలను అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యతా ప్రమాణాలు సరిగ్గా లేకపోతే ఏం చేయాలనే దానిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. వేసవిలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని, ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

వేసవి వేడిమి దృష్ట్యా చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో అవసరమగు అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలని ఆయన చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

వేసవి వేడిమి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేసవి వేడిమి పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పనులుంటే బయటకు రావాలని ఆయన అన్నారు. టోపీ, గొడుగు వంటి వస్తువులు నీడ కోసం వాడాలన్నారు. తెల్లని వదులు దుస్తులు వేసుకోవడం మంచిదని చెప్పారు. ఉపాధి హామీ ప్రదేశాల్లో సైతం నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలని, శరీరం డీ హైడ్రేషన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని చెప్పారు. ఎక్కువ సేపు ఎండలో ఉండి అతి చల్లని పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఎండలో ఎక్కువ సేపు తిరిగి చల్లని నీటిని తలపై వేసుకోవడం వలన కూడా వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న వేడిమి దృష్ట్యా ప్రతి ఒక్కరూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం మేరకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం, కొబ్బరి బొండాలు పానీయాలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన కోరారు.

నీటి తొట్టెల నిర్మాణాలు ప్రారంభించాలి

జిల్లాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు మంగళవారం ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 411 పశువుల తొట్టెలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్ సంచాలకులు తక్షణం నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.

తాగు నీటి సమస్యలపై తక్షణం స్పందించాలి

మండలాల్లో తాగు నీటి సమస్యలపై వస్తున్న అంశాల పట్ల తక్షణం స్పందించాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఎక్కడా తాగు నీటి ఎద్దడి తలెత్తరాదని పేర్కొన్నారు. మండలాల్లో తాగు నీటి సంబంధిత పిర్యాదులకు ప్రత్యేక సెల్ నిర్వహించి ఫిర్యాదులు ఫోన్ ద్వారా గాని, స్వయంగా గాని స్వీకరించి 24 గంటల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆయన అన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమానికే స్ఫూర్తి మోటూరు

మోటూరు ఉదయం చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- పార్వతీపురం

మహిళా ఉద్యమాలకే స్ఫూర్తిదాయకమైన నాయకులు మోటూరు ఉదయం అని మహిళా, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళ జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ గుంటూరు జిల్లా కమ్మవారి పాలేన 1924 అక్టోబరు 13న ఉదయం సంపన్న రైతు కుటుంబంలో జన్మించారని చెప్పారు. బాల్యం నుండి ఆమెకు పాటలు పాడటమన్నా, నాటికలో నటించటమన్నా చాలా ఇష్టమన్నారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఆమె ప్రత్యక్షమయ్యేవారన్నారు. ఆరోజుల్లో ఆమె ఎంతటి పేరు ప్రఖ్యాతలు గడించారంటే కొన్ని తెలుగు సినిమాల దర్శకులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని పాత్రల్ని సృష్టించేవారని చెప్పారు. మహిళా ఉద్యమానికి బుర్రకథా దళం ప్రధాన ఆయుధంలాగా పనిచేసిందని తెలిపారు. 1980లో మహిళ ఉద్యమం రాష్ట్రంలో స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక అంశాలపైన ఆందోళనలు నిర్వహించేవారని చెప్పారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న తర్వాత 2002 మార్చి 31శ్రీ తుదిశ్వాస విడిచారనీ గుర్తు చేశారు. అల్లూరి మన్మోహిని, మల్లు స్వరాజ్యం, కోటేశ్వరమ్మ, ఎం పార్వతి లాంటి వారెందరో ఆమె త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. అదే స్ఫూర్తితో మనం కూడా పనిచేసినప్పుడే ఆమెకు ఘనమైన నివాళి అర్పించినట్లవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మలమన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, శివాని, గంగాభవాని, లక్ష్మి, రమాదేవి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు తుస్సే

టిడిపి కూటమిది కోతల ప్రభుత్వం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఈ ఏడాది ఉగాది నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ తుస్సేనని రుజువైందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. సోమవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి హామీ లివ్వడమే తప్ప అమలు చేసిన దాఖలాల్లేవన్నారు. మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసుకోవచ్చునని గత ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారని తెలిపారు. పది నెలలు దాటినా ఇంతవరకు అమలు చేయలేదని చెప్పారు. ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అసెంబ్లీలో ఉచిత బస్సు ప్రయాణం సొంత జిల్లాలకే పరిమితమని చెప్పడం మహిళలను మోసగించడమేనన్నారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న మన్యం జిల్లా అధికారులు

జాతీయ స్థాయిలో ఎంతో ప్రాధాన్యత ఉన్న సమాచార హక్కు చట్టానికి మన్యం జిల్లా అధికారులు తూట్లు పొడుస్తున్నారని రాజన్నదొర ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన వారం వారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌కు నియోజకవర్గం నుంచి ఇంతవరకు ఎన్ని సమస్యలు అందాయి, ఎన్ని పరిష్కారమయ్యాయని వైసిపి నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షులు పిరిడి రామకృష్ణ దరఖాస్తు చేస్తే సమాచారం ఇవ్వలేదని చెప్పారు. నిర్దేశించిన గడువు దాటినా ఇంతవరకు సమాచారం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. జిల్లాలో గడిచిన పది నెలల్లో ఎంతమంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు, ఏఏ కారణాలతో తొలగించారో సమాచారం కావాలని జిల్లా జల యాజమాన్య కార్యాలయానికి దరఖాస్తు చేయగా మూడు నెలలైనా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. తాను కూడా గత ఏడాది అక్టోబర్‌లో మున్సిపల్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశానని, మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. ఇంతవరకు అతీగతీ లేదని చెప్పారు. మాజీ మంత్రిగా తాను చేసిన ఫిర్యాదుకే దిక్కులేని పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల సమస్యల్ని ఎవరు పట్టించుకుంటారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికల్లో అందిన సమస్యలు పూర్తిగా పరిష్కరించామని జిల్లా అధికారులు, టిడిపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుఎం, హెచ్ఇయు జిల్లా కార్యదర్శి స్వర్ణలత

సచివాలయ ఎఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి

ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలి : యుఎంఅండ్‌హెచ్ఇయు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామ సచివాలయం ఎఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని, వారిని ఆరోగ్య శాఖ పరిధిలోనే కొనసాగించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ స్వర్ణలత డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో యూనియన్ అధ్యక్షులు డి.రమాదేవి అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణలత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ, గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలను ప్రభుత్వం ఒత్తిడికి గురి చేస్తోందని చెప్పారు. వర్క్ పెర్ఫార్మెన్స్ టార్గెట్ పేరుతో వారికి పనిచేయని ట్యాబులు ఇచ్చిందన్నారు. షుగర్ వ్యాధి, బిపి టెస్టులు, రక్త నమూనా సేకరణలో నాణ్యమైన రిపోర్టులు అందించలేదని వారిని తొలగించడానికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం నాణ్యమైన వైద్య పరికరాలను అందించకుండా ఆ తప్పులను వైద్య సిబ్బందిపై నెట్టేయడం సమంజసం కాదని, రాష్ట్రంలో ఇలా ఇటీవల ఆరుగురు ఏఎన్ఎంలను తొలగించడం ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎం (గ్రేడ్ 3 సిబ్బందిని)ను ఎంపిహెచ్ఎ ఫిమేల్‌గా ప్రమోట్ చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, అందుకు తగిన శిక్షణ ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. రికార్డుల నిర్వహణలో తగిన తర్ఫీదు ఇవ్వాలని, యూనిఫాం అలవెన్స్‌తో పాటు వర్క్ పెర్ఫార్మెన్స్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ మన్యం జిల్లా నాయకులు ఎం.ఇందిర, టి.లక్ష్మి, జి.సరస్వతి, భారతి, లత తదితర గ్రామ సచివాలయ ఎఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంప్లాయీస్, పెన్షనర్స్ సెల్ అధ్యక్షులుగా నారాయణ

సాలూరు: వైసిపి నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల సెల్ అధ్యక్షుడిగా ఎంఎస్ నారాయణ ని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర సిఫార్సు మేరకు అధినేత జగన్ మోహన్ రెడ్డి ఎంఎస్ నారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తనను నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల సెల్ అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలని ఎంఎస్ నారాయణ చెప్పారు.

పార్వతీపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు; కురుపాంలో కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్‌ని కలిసిన ముస్లిం పెద్దలు

శాంతికి ప్రతీక రంజాన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ పండగ అని ముస్లిం మత పెద్ద ఫరూక్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం పాలకొండ రోడ్డులో గల జామా మసీదులో ముస్లిములు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు నిర్వహించారు. అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ మాసం ముగిసిందని, జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపమని, అల్లా చూపిన మార్గంలో నడవాలని, అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని కోరారు. ఈ ప్రత్యేక ప్రార్థనలో జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు సయ్యిద్ ఇబ్రహీం హుస్సేన్, ముస్లిం పెద్దలు రజాక్, జలాల్, షఫీ, గౌష్, తేరోజ్, పట్టణంలోని ముస్లిం సోదరులంతా పాల్గొన్నారు.

కురుపాం : రంజాన్ పండగను పురస్కరించుకొని మండల కేంద్రంలో గల శివన్నపేటలో ఉన్న జామియా మసీదులో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు సర్దార్ ఆలంఖాన్ రంజాన్ మాసం ప్రాముఖ్యత ఉపవాస దీక్ష పాటించాల్సిన నియమాలపై ముస్లింలకు వివరించారు. ఈ ప్రార్థనలో మత పెద్దలు, ముస్లిం సోదరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్ ను కలిసిన ముస్లిం సోదరులు

రంజాన్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో గల శివన్నపేట జామియా మసీద్ ముస్లిము సోదరులు సోమవారం మాజీ కేంద్రమంత్రి కిషోర్ చంద్రదేవ్‌ను కురుపాంలో గల ఆయన కోట వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి సరదాగా వారితో కాసేపు గడిపి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మత పెద్దలు సర్దార్ ఆలం ఖాన్, అత్తవుల్ల ,సాదుల్ల భాష ,ఆదిల్, గౌస్, జిలానీ, నిషర్,ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అప్పయ్యపేటలో రంజాన్ వేడుకలను ముస్లిం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అప్పయపేట వద్దగల మసీదువద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఇమామ్ గులాం రసూల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి అల్లా అడుగు జాడలలో నడవాలని కోరారు. పేదలు, అనాధలు, అభాగ్యుల పట్ల దయ, జాలి, కరుణ, ప్రేమ, సోదరభావాన్ని కలిగి జీవించాలని భోదించారు.

సంతలో జిసిసి కాటా

ప్రజాశక్తి - సీతంపేట

చీపుర్లను కొనుగోలు చేసిన సిబ్బంది

మండల కేంద్రం సంత మార్కెట్లో సోమవారం గిరిజన సహకార సంస్థ కాటా వేసి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేశారు. దీనిలో భాగంగా జిసిసి అధికారులు కొండచీపుర్లను కొనుగోలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు జిసిసి ధరల పట్టికపై ఉన్న అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం కుసిమి సంతకు బుధవారం మర్రిపాడు సంతలకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మేన్లు పి.దుర్గారావు, కృష్ణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటితో పోలమాంబ జాతర ముగింపు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవతగా పేరొందిన పోలమాంబ అమ్మవారి పది వారాల పాటు కొనసాగిన జాతర నేటితో ముగియనుంది. ఈ సందర్భంగా మహా చండీ హోమం, అన్నదాన కార్యక్రమాలు చేపట్ట నున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ హాజరు కావాలని దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ కోరారు.

హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ముగ్గురికి ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ప్రముఖ నాడీ జ్యోతిష్యులు మురపాక కాళిదాసుశర్మ, సంఘసేవకుడు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ హెచ్‌సి కె.కృష్ణమూర్తికి కలెక్టర్ శ్యాం పసాద్, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ శోభిక, ఎఎస్‌పి అంకిత సురానా చేతుల మీదుగా ఆదివారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఉగాది పరిష్కారాలను అందజేస్తూ వీరు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలోని లోగోడీవీధికి చెందిన నాగేశ్వరరావు మాస్టరుకు ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం దక్కింది. కళాశాలలో అధ్యాపకులు పనిచేసి కొంతకాలం క్రితమే ఉద్యోగోన్నతి పొందారు. అయితే జ్యోతిష్య శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేసి చుట్టుపక్కల వారికి దీనిపై అవగాహన కల్పించిందుకు ఈ పురస్కారం వరించింది.

డీలాపడ్డ తెలుగు తమ్ముళ్లు

జనసేనకే ఎఎంసి పీఠం

ప్రజాశక్తి -పాలకొండ

నామినేటెడ్ పదవుల కోసం గత కొంతకాలంగా తెలుగు తమ్ముళ్లు ఎదురుచూస్తున్నారు. మూడు తూర్పు కాపు కార్పొరేషన్ ఈ ప్రాంతానికి కేటాయించగా అందులో మండల టిడిపికి చెందిన గండి రామి నాయుడుకు, బిజెపి నుంచి ఒకరికి, జనసేన నుంచి మరొకరికి కట్టబెట్టారు. నియోజకవర్గానికి కేంద్ర బిందువైన వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పీఠం కోసం తెలుగు తమ్ముళ్లు కొంతకాలంగా ఆశపెట్టుకున్నారు. జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టిడిపి బలం పుంజుకోవాలంటే కీలకమైన నామినేట్ పదవులు వరిస్తాయని భావించారు. అయితే జనసేన ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం ఆ పార్టీ బలం పెరగాలని ఉద్దేశంతో జనసేన కూడా ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా మార్కెట్ కమిటీ అధ్యక్ష పీఠం జనసేన కేటాయించారు. సీతంపేట మండలం మర్రిపాడుకు చెందిన బిడ్డక సంధ్యారాణికి ఆ పదవి కేటాయించారు. ఎమ్మెల్యే జయకృష్ణ సిఫారసుతోనే ఈ పదవి వరించినట్లు తెలుస్తుంది. దీంతో టీడీపీ శ్రేణులు డీలాపడినట్లు తెలుస్తుంది. మరోపక్క ఎమ్మెల్యే వర్గానికి చెందిన టిడిపి నాయకులు మాత్రం బిడ్డకి సంధ్యారాణి టిడిపికి చెందిన వ్యక్తిని అయితే ఎమ్మెల్యే సిఫార్సుతోనే ఈ పదవి వచ్చిందని చెప్తున్నారు.

నేరాలు ఘోరాలు

రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట పరిధిలో సోమవారం గుమ్మడివరం రైల్వే గేట్ సమీపంలో రైల్వే పట్టాలపై యువకుడు మృత దేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు. రైలు గుద్దడం వల్ల కానీ, రైలు నుంచి కాలు జారి పడిపోవడం వల్ల కానీ అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని అంచనా వేశారు. మృతుడు అరుణ్ బెహరా, ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ హస్పటిల్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడి గ్రామ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఆర్‌టిసి బస్సు ఢీకొని పాలకొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన మీసాల తిరుపతిరావు (38) మృతి చెందినట్లు ఎస్‌ఐ కళాధర్ సోమవారం తెలిపారు. వీరఘట్టం నుండి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే తిరుపతిరావును 108 సహాయంతో పాలకొండ తరలించారన్నారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వైజాగ్‌లో హత్య.. సాలూరులో ఉరి..

- ప్రేమ పేరుతో ఘాతుకం
- అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని చీపురువలస సమీపంలో ఉన్న జీడి తోటలో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకున్న గిరిజన యువతి వాటిక ఐశ్వర్య మృతి కేసులో మిస్టరీ వీడింది. స్థానిక పోలీసులు 48 గంటల్లో నిందితుడిని పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎఎస్‌పి అంకిత సురానా సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని దత్తివలస గ్రామానికి చెందిన యువకుడు పెరుమాల రాంబాబు(26), వాటిక ఐశ్వర్య గత ఆరునెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఒక పెళ్లిలో ఏర్పడిన పరిచయం వారి మధ్య ప్రేమగా మారింది. అయితే ఐశ్వర్యను పెళ్లి చేసుకుందన్న విషయం చెప్పకుండా దాచిన రాంబాబు ఐశ్వర్యని ప్రేమించాడు. గతనెల 27న విశాఖపట్నంలోని ఆరిలోవ పైనాపిల్ కాలనీ రాంబాబు అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఐశ్వర్య హత్య జరిగింది. అంతకు ముందు శంబర డ్యాం వద్ద కలుసుకున్న సందర్భంలో తనను పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య రాంబాబును ఒత్తిడి చేయడంతో ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆమెను ఈనెల 27న విశాఖపట్నం తీసుకెళ్లాడు. ఆరిలోవలోని తను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య పదేపదే ఒత్తిడి చేయడంతో పసుపు రంగు నైలాన్ తాడుతో ఉరి వేశాడు. అక్కడే ఆమె ఉరి వేసుకుందని నమ్మబలకడానికి 108 వాహనానికి ఫోన్ చేసి రాంబాబు రప్పించి ఆమెను సమీపంలో వున్న ప్రయివేటు ఆసుపత్రికి

వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి అంకిత సురానా

తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారు. దీంతో ఐశ్వర్య మృతదేహాన్ని అదే రోజు రాత్రి సమయంలో మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడు సాయి సహకారంతో చీపురువలస సమీపంలో ఉన్న జీడి తోటకు తీసుకొచ్చాడు. జీడితోటలో ఒక చెట్టుకు ఉరివేసుకొని వున్నట్లు కట్టేసి అక్కడ నుంచి రాంబాబు, అతని స్నేహితుడు సాయి తిరిగి విశాఖపట్నం వెళ్లి పోయారు. మరుసటి రోజు గత నెల 28న జీడితోటలో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని వున్న గిరిజన యువతిని గమనించి కొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎఎస్‌పి తెలిపారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి 48 గంటల్లో శాస్త్రీయ పద్ధతిలో అన్ని ఆధారాలు సేకరించి నిందితుడిని సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, ఎస్‌ఐలు నర్సింహమూర్తి, వెంకట సురేష్ పాల్గొన్నారు.

అక్రమ మద్యము, గంజాయి కలిగి ఉంటే తీవ్ర పరిణామాలు

అక్రమంగా మద్యం, గంజాయి కలిగి ఉంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారిపై కేసులు కూడా పెట్టి జైలుకు పంపిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా ఎఎస్‌పి అంకిత సురానా తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్దిరోజులు కిందటి నుంచి వివిధ సందర్భంలో పట్టుబడిన అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్ సిఐలు బి అప్పలనాయుడు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబులుకు సీమంతం

పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ బి.ప్రమీల గర్భిణి కావడంతో సోమవారం ఎఎస్‌పి అంకిత సురానా సాంప్రదాయ బద్ధంగా ఆమెకు సీమంతం నిర్వహించారు. కానిస్టేబుల్ ప్రమీలకి పసుపు, కుంకుమ, చీర అందజేసి శాలువా కప్పారు. సహచర మహిళా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్దె చెల్లించని సచివాలయాలు

తరచూ ఖాళీ చేయిస్తున్న యజమానులు ● చిరునామా తెలియక అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పాలకొండ

పిల్లి తన పిల్లల్ని పదిళ్లు తిప్పుతుందన్న చందంగా ఉంది పట్టణంలోని సచివాలయాల దుస్థితి. సచివాలయాలకు కట్టాల్సిన అద్దెలు సకాలంలో చెల్లించకపోవడంతో యజమానులు ఎప్పటికప్పుడు ఖాళీ చేయిస్తున్నారు. దీంతో ప్రజలకు సచివాలయాల అడ్రస్ తెలియని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. నగర పంచాయతీ పరిధిలోని 9 సచివాలయాల ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇంద్రానగర్ కాలనీలో ప్రభుత్వ భవనంలో ఒకటి, యాలంలో డివిజన్ ఉపవిద్యాశాఖ కార్యాలయం దగ్గర మరొకటి, నీలం కాలనీలో ఒక సచివాలయం, మెయిన్ రోడ్‌లో అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనంలో ఒక సచివాలయం ఏర్పాటు చేయగా, మిగిలిన ఐదు సచివాలయాలు అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తుండేవారు. అయితే క్రమేపిన ఉపవిద్యా శాఖ కార్యాలయం దగ్గర ఉన్న సచివాలయం ఖాళీ చేసి అద్దె భవనంలోకి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్ పున: ప్రారంభించిడంతో అక్కడ ఉన్న సచివాలయాన్ని ఖాళీ చేసి అద్దె భవనంలోకి తరలించారు. దీంతో ప్రభుత్వ భవనాల్లో రెండే ఉండగా, మిగిలిన ఏడు సచివాలయాలు అద్దె భవనాల్లో ఉంటున్నాయి. ఈ సచివాలయాలకు నెలకు రూ.40వేలు అద్దెలు చెల్లిస్తున్నట్లు నగర పంచాయతీ అధికారులు చెప్తున్నారు. అయితే ఈ అద్దె సకాలంలో

కోమటిపల్లి వీధిలో అద్దె కొంపలో నడుస్తున్న సచివాలయం

చెల్లించకపోవడంతో భవనాలను అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఎప్పటికప్పుడు సచివాలయాలను అద్దె భవనాల్లోకి మార్చడంతో ఎప్పుడు ఎక్కడ కార్యాలయం ఉంటుందో అడ్రస్ తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కోమటిపేట సచివాలయాన్ని నాలుగు భవనాల్లోకి, వెంకన్నపేట సచివాలయాన్ని రెండుచోట్లకు, బాసురు వారి వీధిలోని సచివాలయాన్ని రెండు చోట్లకు ఇలా చెప్పుకుంటూ పోతే ఎక్కడ ఏ ప్రాంతంలో ఏ సచివాలయం ఉంటుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు సచివాలయానికి వెతుక్కోడానికి ఇబ్బందులు పడే పరిస్థితి కనిపిస్తుంది.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వారి పట్ల ఎవరైనా అనుచితంగా గాని, అసభ్యంగా గాని ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, క్లాస్ టీచరుకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం గురించి వివరంగా తెలియజేశారు. ఈ విషయంలో బాల బాలికలకు న్యాయవ్యవస్థ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు శ్రీదేవి, రామప్పడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు , కెజిబివి ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

కష్టం గిరిజనులది.. లాభం దళారులది?

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన రైతులు కొండ ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తులను సేకరించి 40 రోజులు పాటు ఎన్నో కష్టాలు పడి కొండ చీపుర్లు తయారు చేస్తే దళారులకు లాభాలు చేకూరుస్తున్న అధికారులు తీరు మారాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పెద్దశాఖ గ్రామంలో కొండ చీపురులు తయారు చేసి దళారులకు అమ్ముతున్న గిరిజన ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి తయారు చేసిన కొండ చీపుర్లు కనీసం వంద రూపాయలకు ఒక చీపురు ఐటిడిఎ అధికారులు కొనుగోలు చేస్తే కానీ గిరిజనులకు గిట్టుబాటు ధర లభించని పరిస్థితి ఉందన్నారు. ఐటిడిఎ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో బయట ఒక్క కొండ చీపురు రూ.40 నుండి రూ.50 మధ్య దళారులు కొనుగోలు చేసే తిరిగి అధిక లాభాలకు అమ్ముకుంటున్నారన్నారు. గతంలో మహిళా

చీపుర్లను పరిశీలిస్తున్న సాంబమూర్తి

సంఘం వాళ్లు వచ్చి ఒక చీపురు తయారు చేయటానికి కావలసిన చీపురు పుల్లలు 40 రూపాయలకు కొనుగోలు చేసే పరిస్థితి ఉండేదని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు సేకరించి అమ్ముకుంటున్న వస్తువులను దళారుల పాలు కాకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి గిరిజనులకు గిట్టు బాటు ధర కల్పించి గిరిజన ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

సమావేశానికి స్థలం కరువు

వైద్య సిబ్బందికి తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సమావేశాలు పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరు పడకలకే పరిమితం కావడంతో నిత్యం వందలాదిమంది రోగులు ఆసుపత్రికి వచ్చి వెళ్లడంతో ఇరుగ్గా ఉన్నందున సమావేశాలు పెట్టుకునేందుకు అవకాశం లేకపోవడంతో ప్రతి నెలా మొదటి మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం పెట్టేందుకు వీలు లేకపోవడంతో పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పరాయి పంచన సమావేశాలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 33మంది ఆశా కార్యకర్తలు, 8మంది సిహెచ్‌డబ్ల్యులతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు సమావేశానికి హాజరు కావడంతో వీరికి సరిపడా గదుల్లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి సందర్శించినప్పుడు సమావేశం పెట్టుకునేందుకు స్థలం లేదని వైద్యాధికారులు పిఒ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సమావేశం పెట్టుకునేందుకు వసతి గృహం అధికారులతో

ఆరుబయట నిర్వహిస్తున్న సమావేశం (ఫైల్)

మాట్లాడతానని, మీరు అక్కడ సమావేశం పెట్టుకోవచ్చని వైద్య అధికారులకు సూచించారు. సమావేశం పెట్టిన ప్రతిసారి ఇక్కడి వైద్యాధికారులు వసతి గృహ సంక్షేమాధికారితో మాట్లాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సమావేశం పెట్టుకునేందుకు వీలుగా అదనపు భవన సదుపాయం కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

ఆక్రమణకు గురవుతున్న కాలువ ఇదే..

రహదారిపై నిలిచిన సాగునీరు

ఆక్రమణదారుల చెరలో కాలువ

ప్రజాశక్తి - వీరఘట్టం

చెరువులే కాదు.. పంట కాలువలు కూడా ఆక్రమణదారులు కబ్జా చేయడంతో సాగునీరు ఎటూ వెళ్లక రహదారిపై నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సర్దార్ గౌతు లచ్చన్న (తోటపల్లి) రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో ఐదో బ్రాంచ్ నుంచి పిల్ల కాలువ ద్వారా బిఎంఆర్ థియేటర్ వెనుక నుంచి వట్టిగెడ్డ వంతెన కింద నుంచి దళితవాడల నుండి సుమారు 50 ఎకరాలకు పైబడి చిన్నబట్టి కాలువ ద్వారా అడపా వారి పొలాలకు సాగునీరు వెళ్లాల్సి ఉంది. ఎగువ ప్రాంతం ఉన్న కాలువను కబ్జా చేయడంతో సాగునీరు రావడం గగనమైంది. చేసేదేమీ లేక ప్రస్తుతం రైతులు బోరు బావులపై ఆధారపడాల్సి పరిస్థితి ఏర్పడుతుంది.

రహదారి పై నిలిచిన సాగునీరు

పిల్ల కాలువ కబ్జాకు గురి కావడంతో ప్రస్తుతం తాటిపూడి ప్రాజెక్టు ద్వారా విడిచి పెడుతున్న సాగునీరు ఎటు వెళ్లాక బిసి కాలనీ, రెల్లి వీధులకు మధ్యన రహదారిపై సాగునీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన కాలువను పునరుద్ధరించి సాగునీరు పంట పొలాలకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకున్నారు.

టిడ్కో గృహాలను అందజేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

టిడ్కో లబ్ధిదారులకు గృహాలను త్వరతగతిన అందజేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం అడ్డాపు శీల గ్రామ పరిధిలో ఉన్న టిడ్కో గృహలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2015లో అడ్డాపు శీల గ్రామ పరిధిలో 16 అపార్ట్‌మెంట్‌లో ప్రస్తుతం 768 గృహాలు నిర్మించి లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ లబ్ధిదారులకు గృహాలను అప్పజెప్పకుండా మారుతున్న ప్రభుత్వాలు టిడ్కో లబ్ధిదారులను ఏటా ఏప్రిల్ ఫూల్ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఇళ్లను పేదలకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొత్స మోహన్‌రావు పాల్గొన్నారు.

తిరుపతినాయుడు సేవలు శ్లాఘనీయం

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేస్తున్న డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు సేవలు శ్లాఘనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. అతనితో పాటు విద్యా శాఖ సహాయ సంచాలకులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న పాలవలస దామోదరరావు సేవలు మిగిలిన ఉద్యోగులు అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ప్రసంశించారు. విద్యా శాఖలో డిఇఒ, ఎడిగా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్థానిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ జిల్లా విద్యాశాఖాధికారిగా తిరుపతి నాయుడు జిల్లాలో తనదైన శైలిలో మంచి పనితీరును కనబరచారాని అభినందించారు. తన విధులను అత్యంత సమర్థవంతంగా, బాధ్యతతో నిర్వర్తిం చేవారని చెప్పారు. అంకితభావం, నిబద్ధతకు తిరుపతి నాయుడు ప్రతిరూపమని పేర్కొన్నారు. నేటి తరం ఉద్యోగులు ఆయన పనితీరును చూసి స్ఫూర్తి పొందాలని కోరారు. జిల్లాలో ఉన్న కొద్దిపాటి సమర్థవంతమైన అధికారుల్లో తిరుపతి నాయుడు ఒకరని కొనియాడారు. రాబోయే డిఇఒ ఆయన లోటును తీర్చాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి నాయుడు ఉద్యోగ విరమణ చేసినప్పటికీ, అవసరమైతే భవిష్యత్తులో ఆయన సేవలను వినియోగించుకుంటామని కలెక్టర్ తెలిపారు. సహాయ సంచాలకులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన పాలవలస దామోదరరావు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. విద్యా శాఖ అధికారులు పదవీ విరమణ

తిరుపతినాయుడును సత్కరిస్తున్న కలెక్టర్

పొందిన ఉద్యోగులు మాదిరిగా ఇచ్చిన లక్ష్యాలను సాధించి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. అనంతరం డిఇఒ, ఎడిలకు కలెక్టర్ జ్ఞాపికను అందిస్తూ దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు తిరుపతి నాయుడు, దామోద రరావు మాట్లాడుతూ చేసే ప్రతి ఉద్యోగికివృత్తి పట్ల అంకితభావం, చిత్తశుద్ధి ఉండాలన్నారు. అందులో భాగంగానే తన పనిలో సంతోషాన్ని వెతుక్కుంటూ విధులను నిర్వహించామన్నారు. ఏ వృత్తి లోనైనా సానుకూల దృక్పథం విజయానికి సోపానమని, మాట పడకూడదన్న తపనే తమ విజయానికి కారణమని అన్నారు. తనకు చేదోడువాదోడుగా ఉన్న కుటుంబ సభ్యులకు, సహెూద్యోగులకు, మిత్రులకు ఈ సందర్భంగా వారిరువురూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, సహాయ సంచాలకుల కుటుంబ సభ్యులు, మిత్రులు, జిల్లా అధికారులు, విద్యా శాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వృక్షాలు నరికివేత

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు నిత్యం విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్న విషయం మంచిదైనప్పటికీ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో భారీ వృక్షాలు గొడ్డలి వేటకు బలవుతున్నాయి. మండలంలోని సుమారు 25 కిలోమీటర్ల మేర అంతర్రాష్ట్ర రహదారి ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు కొత్తగా విద్యుత్ లైన్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆయా కాంట్రాక్టర్లు విద్యుత్ పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్తు లైన్లు వేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్‌కు సమయం, డబ్బు ఆదా చేసుకునేందుకు వారికి నచ్చినట్లు విద్యుత్ స్తంభాలు పాతడం, అవసరమైన చోట భారీవృక్షాలను నరికివేతకు గురవుతున్నాయి. కొమరాడ మండల కేంద్రానికి అతి సమీపంలో కూనేరు వరకు అంతర్రాష్ట్ర రహదారి పక్కన భారీ వృక్షాలను ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ మిషన్లతో కట్ చేసి రోడ్డు పక్కనే పడి వేస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణించే వాహనచోదకులకు ఆ కర్రలు తగులుకొని ప్రమాదాలు బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల సమీపంలో రోడ్డుపై ఉన్న భారీ వృక్షాన్ని నరికి వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరికేసిన ఈ చెట్టు ఎంతో మందికి నీడనిచ్చి బస్సు కోసం ఎదురుచూసే సమయంలో నీడని ఇచ్చేదని, ఇప్పుడు ఈ చెట్టు నరికి వేయడంపై ప్రయాణికులు నీడ కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షాలకు అటవీ, రెవెన్యూ శాఖలు ఎటువంటి అనుమతులు లేకుండా తొలగింపుపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు పెంచి

రోడ్డు పక్కనే నరికివేసిన చెట్టు మోడు

కాలుష్యాన్ని నివారించాలని అధికారులు ఒకవైపు చెపుతుంటే ఎంతో పెద్ద వృక్షాలను నీడని ఫలాన్ని అందిస్తున్న సమయంలో ఇలాగే వారి అవసరాలకు ఇష్టానుసారంగా నరికివేసి మొక్కలను నాశనం చేస్తున్న విద్యుత్ కాంటాక్ట్‌పై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికుల కోరుతున్నారు. ఈ విషయంపై కొమరాడ అటవీశాఖ సెక్షన్ అధికారి సత్యనారాయణ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా చెట్లు నరికేందుకు ఎటువంటి అనుమతులు తాము ఇవ్వలేదని చెప్పడం విశేషం.